# పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతా శేఖర్‌గౌడ్**



బతుకమ్మ చీరెలను అందజేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్, అక్టోబర్ 6: నిరుపేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్ మండలం గౌతోజిగూడెంలో 37 మందికి ఇండ్ల పట్టాలు, రూ.10 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ స్పోర్ట్స్ కిట్‌లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ ఫలాల అమలులో తెలంగాణ ప్రభుత్వం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. దేశానికే పట్టుకొమ్మలైన పల్లెల రూపు రేఖలు మార్చారని కొనియాడారు. గౌతోజిగూడెం కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడిన అనతికాలంలోనే అభివృద్ధి పథంలో దూసుకెళ్లి ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. నర్సాపూర్ నుంచి గౌతోజిగూడెం మీదుగా గజ్వేల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పంచమి రేణుకుమార్ కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పురం మహేశ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ లాయక్, మాజీ జడ్పీటీసీ నారాగౌడ్, ఆత్మ కమిటీ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు స్వామి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనర్సయ్య, నాయకులు ఇర్ఫాన్, ఆనంద్, సత్యనారాయణ, నర్సింలు పాల్గొన్నారు.

- మెదక్ జిల్లాలో 392 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా అధికారులు చూసుకోవాలి
- కలెక్టర్ రాజర్షి షా
- ధాన్యం కొనుగోలుపై సమీక్ష

# దళారులను నమ్మి మోసపోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

మెదక్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): వానకాలంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మెదక్ జిల్లాలో 392 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కొనుగోలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్వాహకులు నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని, రైతులు ధాన్యాన్ని తప్పనిసరిగా తూర్పార పట్టి తెచ్చేలా చూడాలన్నారు. 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా ధాన్యాన్ని ఎండపెట్టి అమ్మకానికి తీసుకురావాలన్నారు. విస్తృతంగా ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని అధికారులు సూచించారు. ఆ ధాన్యాన్నే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు పంపాలని ఆదేశించారు. ట్రక్ షీట్‌లో దిద్దడం చేయరాదన్నారు. గన్నీ సంచులు వెలుపలికి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ముందుగా రైతులకు టోకెన్ ఇవ్వాలని, కేటాయించిన రోజున కేంద్రానికి వచ్చి ధాన్యాన్ని తీసుకొచ్చి విక్రయించేలా చూడాలన్నారు. ప్రతి రైతు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం వెంట తీసుకురావాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించేందుకు అవసరమైన రవాణా సౌకర్యాన్ని ఏర్పాటుచేయాలన్నారు. కొనుగోలు చేసిన సరకును మిల్లులకు తరలించడంలో అలసత్వం వహించవద్దన్నారు. ఐకేపీ, సివిల్ సప్లై, మార్కెటింగ్, ట్రాన్స్ పోర్టు శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మరావు, సివిల్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా సహకార అధికారి కరుణ, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ రియాజ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా తునికలు కొలతల అధికారి సుధాకర్, జిల్లా రవాణా అధికారులు, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

# 15 నుంచి ఏడుపాయల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు

పాపన్నపేట, అక్టోబర్ 6: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల15న మొదటి రోజు శరన్నవరాత్రి ఉత్సవాలను అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు శ్రీశైలపుత్రి (బాలా త్రిపుర సుందరి) అవతారంలో దర్శనం ఇవ్వనున్నారు. రెండో రోజు బ్రహ్మచారిని (గాయత్రీ దేవి)గా, మూడో రోజు చంద్ర గంట (అన్నపూర్ణ) అవతారంలో దర్శనం ఇస్తారు. నాలుగో రోజు కూష్మాండ (వనదుర్గా)గా, ఐదో రోజు స్కంద మాత (మహాలక్ష్మి)గా, ఆరో రోజు షష్ఠి కాత్యాయని (సరస్వతిదేవి)గా దర్శనమిస్తారు. ఏడో రోజు కాల రాత్రి (దుర్గాదేవి), 8వ రోజు మహా గౌరీ సిద్ధి రాత్రి (మహిషాసురా మర్ధిని)గా, చివరి రోజు 9వ రోజు నవమి, దశమి (విజయదశమి) రాజరాజేశ్వరీదేవీగా దర్శనం ఇస్తారని ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి వెల్లడించారు. అక్టోబర్ 20న ఉదయం 11 గంటలకు బోనాల కార్యక్రమం, 22న చండీ హోమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాలను జయప్రదం చేయాలని భక్తులకు విజ్ఞప్తిచేశారు.

# ‘కొత్త’ గెలుపునకు ప్రత్యేక కోర్ కమిటీ

**బీ కొండపూర్ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు**



బీ కొండపూర్ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ కోర్ కమిటీ సభ్యులు

చేగుంట, అక్టోబర్ 6: దుబ్బాక అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపించుకోవడమే లక్ష్యమని చేగుంట మండల బీఆర్‌ఎస్ కోర్ కమిటీ స్పష్టంచేసింది. శుక్రవారం కోర్ కమిటీ సభ్యులు ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, చేగుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ తానీషా, టెలికాం బోర్డు మాజీ డైరెక్టర్ తీగుల్ల వేణుగోపాల్ శర్మ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీ కొండపూర్‌లోని సింగరాయునిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సుభాష్‌రెడ్డి, వడ్డెపల్లి నర్సింహులు, కమ్మరి వెంకటేశం, మైనార్టీ మండల నాయకుడు మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



శరన్నవరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

మెదక్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏడుపాయల్లో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుపాయల్లో భక్తులకు వసతుల కల్పనపై దృష్టి సారించినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఇటీవల ఏడుపాయల అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఈ నిధులతో ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పార్టీ పాపన్నపేట మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ధర్మకర్తలు మాణమ్మ, కిషన్, సిద్ధిరాములు, వెంకటేశం, మనోహర్, నాగభూషణం, మోహన్‌రావు, సాయిలు, పెంటయ్య, చక్రపాణి, రఘువీర్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, రాగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ‘భాగ్యనగర్ కాపర్’ సౌజన్యంతో వైకుంఠ రథం



శభాష్‌పల్లిలో వైకుంఠరథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, అక్టోబర్ 6: మండలంలోని శభాష్‌పల్లి గ్రామంలో భాగ్యనగర్ కాపర్ పరిశ్రమ సౌజన్యంతో వైకుంఠ రథం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం భాగ్యనగర్ కాపర్ పరిశ్రమ యాజమాన్యం శభాష్‌పల్లి గ్రామానికి వైకుంఠ రథం అందజేశారు. ఈ రథాన్ని స్థానిక సర్పంచ్ రంగవల్లి పార్వతీసత్యం, కంపెనీ ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు మూడు బోర్లు, మూడు మినీ ట్యాంకులు, పాఠశాల విద్యా వలంటీర్‌కి నెలకు రూ.9వేల చొప్పున అందజేయడంతో పాటు వైకుంఠరథాన్ని ఏర్పాటు చేయడంతో కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం గ్రామానికి చెందిన ముగ్గురు ఏఆర్ విభాగంలో పోలీసులుగా ఉత్తీర్ణత సాధించిన అయ్యగారి హరీశ్, అయ్యగారి సతీశ్, గుండె భవానీని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు లావణ్యా మాధవరెడ్డి, ఎంపీటీసీ దశరథ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, రాజశేఖర్‌గౌడ్, కంపెనీ ప్రతినిధులు అగర్వాల్, వీరభద్రరావు, నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, షేక్‌అలీ తదితరులు ఉన్నారు.

# సోమలింగంగౌడ్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మెదక్ అర్బన్, అక్టోబర్ 6: మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్ పట్టణంలో మొదటి మున్సిపల్ చైర్మన్ సోమలింగంగౌడ్, కామ్రేడ్ కేవల్ కిషన్ విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. మెదక్ పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్లకు వివిధ చోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజు, ఆర్కే శ్రీనివాస్ పాల్గొన్నారు.